## ఇష్టంతో చదవాలి

నర్సాపూర్, జనవరి 22: విద్యార్థులు ఇష్టంతో చదవాలని మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ సూచించారు. బుధవారం నర్సాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో పదో తరగతి విద్యార్థుల ప్రేరణకు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల జ్ఞాపకశక్తి మెరుగుపడడానికి రెండు చిట్కాలు ఉదహరించారు. ఒకటి 21 గుంజీలు తీయాలని, రెండోది మెదడును ఉత్తేజితం చేసేందుకు 1 నుంచి 100 లెక్కించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో తారాసింగ్ పాల్గొన్నారు.

## ప్రతి శుక్రవారం మహిళలకు డ్రైవింగ్ లైసెన్స్ మేళా

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 22: ప్రతి శుక్రవారం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో మహిళలకు ప్రత్యేకంగా లర్నింగ్ లైసెన్స్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా రవాణాధికారి వెంకటస్వామి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 24 నుంచి మార్చి నెల 8వ తేదీ వరకు ఈ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 18 ఏండ్లు నిండి, వాహనాలు నడిపే మహిళలు, యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## దివంగత లచ్చయ్యకు ఘన నివాళి


మానెగల్ల లచ్చయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

రామాయంపేట, జనవరి 22: మండలంలోని ఝాన్సీలింగాపూర్‌లో దివంగత లచ్చయ్య విగ్రహానికి మాజీ సర్పంచ్‌లు మానెగల్ల రామకిష్టయ్య, పంబాల జ్యోతి శ్రీనివాస్, ఉపసర్పంచ్ బానప్పగారి సుధాకర్ రెడ్డి నివాళులర్పించారు. ఆరేండ్లుగా ఆయన లేని లోటును మానెగల్ల రామకిష్టయ్య తన ఆయుర్వేద వైద్యంతో తీరుస్తున్నాడన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు చాకలి పోచయ్య, సాలెమన్, శ్రీనివాస్, దుర్గయ్య తదితరులు ఉన్నారు.

## గ్రంథాలయాలను ఆధునీకరిస్తాం

రామాయంపేట, జనవరి 22: జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయాలను ఆధునీకరిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి అన్నారు. బుధవారం రామాయంపేటకు విచ్చేసిన ఆమె లైబ్రరీలో రికార్డులను తనిఖీ చేశారు. జిల్లాలో 20 మండలాలకు 20 గ్రంథాలయాలు ఉన్నాయన్నారు. 16 గ్రంథాలయాలకు పక్కా భవనాలున్నాయని, రేగోడ్‌లో భవనానికి నిధులు మంజూరయ్యాయన్నారు. చైర్మన్ వెంట లైబ్రేరియన్ వంశీకృష్ణ ఉన్నారు.

## గ్రంథాలయం ఏర్పాటుకు స్థల పరిశీలన

చిలిపిచెడ్, జనవరి 22: చిలిపిచెడ్‌లో గ్రంథాలయం ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, కార్యదర్శి వంశీకృష్ణ తెలిపారు. బుధవారం చిలిపిచెడ్‌లో గ్రంథాలయం ఏర్పాటుకు పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. వారితో ఎంఈవో విఠల్, నర్సాపూర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సావిత్రి ఉన్నారు.

## ఎమ్మార్పీఎస్ ఎంబీపూర్ గ్రామ కమిటీ ఎన్నిక

మెదక్ రూరల్, జనవరి 22: ఎమ్మార్పీఎస్ మక్తభూపతిపూర్ గ్రామ కమిటీని బుధవారం జిల్లా అధ్యక్షుడు బాలరాజ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా చెవిటి గట్టయ్య, అధికార ప్రతినిధిగా బండమీది బాలరాజ్, ఉపాధ్యక్షులుగా చెవిటి సుధాకర్, కర్రోళ్ల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా కంజర్ల ప్రసాద్, కార్యదర్శులుగా చెవిటి దాస్, గుట్ట శ్రీనివాస్, కోశాధికారిగా కర్రోళ్ల బాబు ఎన్నికయ్యారు.

## కాంప్లెక్స్ సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దశంకరంపేట, జనవరి 22: ఉపాధ్యాయులు కాంప్లెక్స్ సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఎస్‌వో నవీన్ అన్నారు. బుధవారం మండలంలోని మూసాపేట స్కూల్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. ఎఫ్ఎల్ఎన్ బోధన విధానంపై అనుసరించాల్సిన పలు విషయాలను ఉపాధ్యాయులకు వివరించారు. ఆన్‌లైన్ ఎంట్రీ, పాఠశాల అకాడమిక్ అంశాలకు సంబంధించి పలు సూచనలిచ్చారు. ఎంఈవో వెంకటేశం, కాంప్లెక్స్ హెచ్ఎం విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ త్రినేత్ర హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. Ph: 8520980099 / 8520874499.
NT-327009-AII

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# గ్రామసభల్లో ప్రశ్నల వర్షం

- రెండో రోజూ నిలదీతలు
- జిల్లా వ్యాప్తంగా గ్రామసభలు గరంగరం
- అర్హుల జాబితాపై అభ్యంతరాలు
- ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో భూమి ఉన్నవారి పేర్లే వచ్చాయంటూ ఆందోళన
- రామాయంపేట 8వ వార్డు సభలో ఆందోళన
- అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామస్తులు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం


మనోహరాబాద్: కూచారంలో నిర్వహించిన గ్రామ సభలో మాట్లాడుతున్న ఆర్డీవో జయచంద్రారెడ్డి


చిలిపిచెడ్: జగ్గంపేటలో నిర్వహించిన గ్రామసభలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం


నర్సాపూర్: రేషన్ కార్డు జాబితాలో పేరులేదని మున్సిపల్ 6వ వార్డులో కంటతడి పెడుతున్న వృద్ధురాలు, మహిళ


చిన్నశంకరంపేటలో నిర్వహించిన గ్రామ సభలో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

మెదక్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, రేషన్ కార్డుల అర్హుల ఎంపికకు జిల్లాలో బుధవారం నిర్వహించిన గ్రామ సభల్లో ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. అనర్హులకు జాబితాలో చోటు కల్పించారంటూ అధికారులను నిలదీశారు. జిల్లాలోని టేక్మాల్ మండలం పాల్వంచలో గ్రామ సభ రసాభాసగా కొనసాగింది. విధి నిర్వహణలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలంటూ ప్రజలు డిమాండ్ చేశారు. శివ్వంపేట మండలం పాంబండలో అనర్హుల పేర్లు ఎంపిక చేశారని అధికారులను ప్రజలు నిలదీసి, ఆందోళన చేశారు. కొల్చారం మండలం కొంగోడు, నాయిని జలాల్‌పూర్ గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభలు రసాభసగా మారాయి. నిజాంపేట మండలం నస్కల్ గ్రామంలో బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని గ్రామ సభ బయట గ్రామస్తులు నిరసన తెలిపారు. నర్సాపూర్ మండలం బ్రాహ్మణపల్లిలో రచ్చరచ్చ జరిగింది.

### రామాయంపేటలో రసాభస

రామాయంపేట, జనవరి 22: మండలంలోని ఝాన్సీలింగాపూర్‌లో గ్రామసభ రసాభసగా సాగింది. గ్రామసభలో పథకాలను చదువుతున్నప్పుడు అధికారులకు గ్రామస్తులకు మధ్య వాగ్వాదం జరిగింది. సభలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో భూములు లేనివారికే ఇందిరమ్మ ఆత్మీయ పథకం వర్తించాలని అధికారులు తెలిపారు. దీంతో భూములు ఉన్నవారి పేర్లు ఎలా చేరుస్తారని ఎంపీడీవోపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి పేర్లను వెంటనే తొలగించాలని, లేకుంటే ఇక్కడి నుంచి అధికారులను కదలనివ్వమని మొండికేశారు. ఎంపీడీవో ఎంత సముదాయించినా గ్రామస్తులు వినలేదు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, గజవాడ నాగరాజు, దేమె యాదగిరి, చంద్రపు శోభ కొండల్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

### జగ్గంపేటలో గందరగోళం

చిలిపిచెడ్, జనవరి 22: మండలంలోని జగ్గంపేట గ్రామ సభలో గందరగోళం చోటుచేసుకున్నది. పంచాయతీ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సింధూజ, ఆర్ఐ సునీల్ చౌహాన్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. జాబితాలోని పేర్లు చదవడంతో కొంతమంది పేర్లు లేకపోవడంతో బీఆర్ఎస్ నాయకులు వారి పేర్లు జాబితాలో ఎందుకు లేవని అధికారులను ప్రశ్నించారు. దీంతో కాంగ్రెస్ నాయకులు వాగ్వాదానికి దిగారు. జాబితలో పేర్లు రానివారు దరఖాస్తులు ఇవ్వాలని డిప్యూటీ తహసీల్దార్ కోరారు.

### ఎంపీవో పై చర్యలు తీసుకోవాలి

రాందాస్ గూడలో దురుసుగా మాట్లాడిన ఎంపీవో శరత్‌కుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, నాయకులు ఎంపీడీవో ఆనంద్‌కు ఫిర్యాదు చేశారు. రేషన్‌కార్డుల కోసం 80 దరఖాస్తులివ్వాగా కేవలం 16 మాత్రమే వచ్చినవని గ్రామస్తులు అడగడంతో ఎంపీవో దురుసుగా మాట్లాడుతూ, ఎమ్మెల్యేకో, ఎంపీకో చెప్పుకోండంటూ సభ నుంచి లేచి వెళ్లిపోయారు. దీంతో సభ అసంపూర్తిగా ముగిసింది. ఫిర్యాదు చేసిన వారిలో మాజీ సర్పంచ్ యాదగిరి, నాయకులు వెంకట్‌రెడ్డి, మధుసూదన్, బాబురావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### తప్పుల తడకగా లబ్ధిదారుల జాబితా

కొల్చారం, జనవరి 22: గ్రామసభల్లో అధికారులు ప్రవేశపెట్టిన లబ్ధిదారుల జాబితా తప్పులతడకగా ఉన్నదని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. మండలంలోని ఏటిగడ్డ మాందాపూర్, వరిగుంతం, రాంపూర్, కొంగోడ్, నైన్ జలాల్‌పూర్, పోతిరెడ్డి పంచాయతీల్లో బుధవారం అధికారులు గ్రామసభలు నిర్వహించారు. కొంగోడ్, నైన్ జలాల్ పూర్ గ్రామాల్లో డిప్యూటీ తహసీల్దార్ నాగవర్ధన్, ఏవో శ్వేతాకుమారి, ఏపీవో మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. జాబితా వినిపించగానే పథకాలకు ఎంపిక కాని ప్రజలు అధికారులను నిలదీశారు.

### బీటీ రోడ్డు పనులెప్పుడు?

నిజాంపేట, జనవరి 22: మండలంలోని నార్లపూర్, వెంకటాపూర్(కె), నగరం, నస్కల్, తిప్పనగుల్ల గ్రామాల్లో పథకాల వర్తింపుపై నిర్వహించిన గ్రామసభల్లో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. నస్కల్ గ్రామసభను గ్రామస్తులు అడ్డుకున్నారు. నిజాంపేట ప్రధాన రోడ్డుపై బీటీ పనులు ప్రారంభించాలని నిరాహార దీక్ష చేపట్టినా ఎవరూ పట్టించుకోలేదని నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

### బ్రాహ్మణపల్లి గ్రామసభ రచ్చరచ్చ

నర్సాపూర్, జనవరి 22: బ్రాహ్మణపల్లిలో నిర్వహించిన గ్రామ సభ రచ్చరచ్చగా మారింది. అనర్హులతో జాబితా సిద్ధం చేయడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రాహ్మణపల్లిలో ఎంపీవో వైద్య శ్రీనివాస్, పంచాయతీ సెక్రటరీ తారాసింగ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల జాబితా చదవగానే గ్రామస్తులు అధికారులపై తిరగపడ్డారు. దీంతో గ్రామసభ ముగించకుండానే మధ్యలోనే ఎంపీవో అక్కడి నుంచి జారుకున్నారు.

### నర్సాపూర్‌లో కంటతడి పెట్టిన లబ్ధిదారులు

నర్సాపూర్ మున్సిపల్ 6వ వార్డు గ్రామసభలో ఓ మహిళ, వృద్ధురాలు తమ గోడు వెల్లబోసుకుంటూ కన్నీటిపర్యంతమయ్యారు. రేషన్ కార్డు కోసం ఎన్నిసార్లు దరఖాస్తు పెట్టుకున్నా జాబితాలో పేరు లేదని మహిళ, ఓ వృద్ధురాలు అధికారుల ముందు ఏడ్చేశారు. తనకు ఇద్దరు పిల్లలున్నారని, వారిని ఎలా పోషించుకోవాలని, సొంతిల్లు కూడా లేదని కిరాయికి ఉంటున్నామని మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ కార్డుకు 200 మంది దరఖాస్తు చేసుకుంటే 11 మందికి మాత్రమే వచ్చాయని నర్సాపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రిజ్వాన్‌ను కాలనీవాసులు నిలదీశారు.

### వెల్దుర్తిలో కొనసాగిన గ్రామసభలు

వెల్దుర్తి, జనవరి 22. ప్రభుత్వ పథకాల కోసం నిర్వహించిన గ్రామసభలు కొనసాగాయి. సభల్లో అధికారులు లబ్ధిదారుల పేర్లు చదివి వినిపించారు. పేర్లు లేని వారు దరఖాస్తు చేసుకోవాలని, ఏవైనా అభ్యంతరాలుంటే తెలుపాలని సూచించారు. పలు గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక, పథకాల అమలుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

### మిగితా పథకాల సంగతేంది?

మనోహరాబాద్, జనవరి 22: మండలంలోని రామాయిపల్లి, పోతారం, గౌతోజిగూడెం, మనోహరాబాద్, రంగాయిపల్లి, కూచారం, కాళ్లకల్ తదితర గ్రామాల్లో గ్రామ సభలు రసాభసగా కొనసాగాయి. నాలుగు పథకాల్లో సరైన సర్వే జరుగలేదని ప్రజలు ఆందోళనకు దిగారు. రైతుభరోసా, రెండులక్షల రుణమాఫీ, తులం బంగారం, మహిళలకు రూ. 2500 వంటి ఎన్నో హామీలిచ్చి, ఇప్పుడు నాలుగు పథకాలే ఏంటని కూచారం గ్రామసభలో ఆర్డీవో జయచంద్రారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నరేశ్ ముదిరాజ్, ఉదయ్ రంజన్‌గౌడ్ నిలదీశారు. సరిగ్గా సర్వే చేయకుండానే అనర్హులకు పథకాలు కేటాయించారని మండిపడ్డారు.

### నిలదీతల మధ్య గ్రామసభలు

చిన్నశంకరంపేట, జనవరి 22: మండలంలోని వివిధ గ్రామాల్లో నిలదీతల మధ్య గ్రామసభలు కొనసాగాయి. ఇండ్ల జాబితాలో దరఖాస్తు చేసుకున్న తమ పేర్లు ఎందుకు రాలేదని ప్రజలు అధికారులను నిలదీశారు. జాబితాలో కొంతమంది పేర్లు ఎలా వస్తాయని, అనర్హుల పేర్లు జాబితాలో వచ్చాయని ప్రశ్నించారు.

### అర్హులకే సంక్షేమ పథకాలు


తూప్రాన్: వెంకటాయపల్లిలో నిర్వహించిన సమావేశంలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు


మెదక్ మున్సిపాలిటీ: వార్డు సభలో దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 22: అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ అన్నారు. బుధవారం మెదక్‌లోని 9, 10, 11, 12, 13, 14, 15, 16 వార్డుల్లో వార్డు సభలు నిర్వహించారు. వార్డులో ఆయా కౌన్సిలర్లు కల్యాణి గాయత్రి, సులోచన, సుంకయ్య, సమియొద్దీన్‌తో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. సభల్లో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### తులం బంగారం, రుణమాఫీ ఎక్కడ?

తూప్రాన్, జనవరి 22: మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలు రసాభసగా ముగిశాయి. లబ్ధిదారుల ఎంపిక సరిగ్గా జరుగలేదని, సరైన సర్వే చేయకుండానే లబ్ధిదారుల ఎంపిక ఎలా చేస్తారంటూ వెంకటాయపల్లిలో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. గ్రామ సభ ప్రారంభం కాగానే తులం బంగారం, రెండు లక్షల రుణమాఫీ ఎక్కడ అని గ్రామస్తులు ప్రశ్నించారు. లబ్ధిదారుల వివరాలు వెల్లడించగా గ్రామస్తులంతా తిరగబడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లంబ రమేశ్, వైస్ ప్రెసిడెంట్ నర్సింహా పాల్గొన్నారు.

### గ్రామ సభల్లో ఆందోళనలు

చేగుంట, జనవరి 22: మండలంలోని చిన్నశివునూర్, చిట్టొజిపల్లి, కర్నాల్‌పల్లి, పోతాన్‌పల్లి, పులిమామిడి, రెడ్డిపల్లి, రుక్మాపూర్, వడియారం, నార్సింగి, వల్లూర్, నర్సంపల్లి, శేరిపల్లిలో నిర్వహించారు. లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. నార్సింగి మండలంలో 18 వందల మంది ఇండ్లకు దరఖాస్తు చేసుకుంటే సగం మందికి కూడా రాలేదని, రేషన్ కార్డులకు పరిస్థితి అలాగే ఉందని ఆందోళన చేశారు.

### గందరగోళంగా గ్రామసభలు

కౌడిపల్లి, జనవరి 22: మండలంలోని 10 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. తిమ్మాపూర్‌లో అర్హులలైన వారికి ప్రభుత్వ పథకాలు అందడం లేదని అధికారులను నిలదీశారు. దరఖాస్తు పెట్టుకున్న వాటిలో ఏ ఒక్కటీ లబ్ధిదారులకు చేరలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దరఖాస్తులు పెట్టుకున్నా ఇప్పటి వరకు ఏ ఒక్కటీ మంజూరు కాలేదని కొట్టాల గ్రామ సభలో అధికారులను నిలదీశారు.

### పాంబండలో ప్రజల ఆందోళన

శివ్వంపేట, జనవరి 22: ప్రభుత్వ పథకాల కోసం అనర్హులను ఎంపిక చేస్తుండడంతో గ్రామ సభల్లో ప్రజలు ఆందోళనలు చేస్తూ, అధికారులను నిలదీశారు. పాంబండ గ్రామంలో జాబితా ప్రకారం పథకాలు వస్తాయని అధికారులు చెప్పడంతో తమకు అన్యాయం జరుగుతుందని గ్రామస్తులు గ్రామసభను బహిష్కరించి, ఆందోళన చేశారు. కొంతాన్‌పల్లిలో తమ కాలనీకి తాగునీరు రావడం లేదని మహిళలు మండిపడ్డారు.

# అసత్య వార్తలు ప్రచురిస్తే కఠిన చర్యలు

**కలెక్టర్ రాహుల్‌రాజ్**


నర్సాపూర్ ఏరియా ప్రభుత్వ దవాఖానలోని వార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్


మెదక్ మున్సిపాలిటీ: ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్పీ ఉదయ్‌కుమార్

నర్సాపూర్, జనవరి 22: వైద్యారోగ్య శాఖ, ప్రభుత్వ దవాఖానలపై అసత్య వార్తలు ప్రచురిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాహుల్‌రాజ్ స్పష్టం చేశారు. బుధవారం నర్సాపూర్ ఏరియా ప్రభుత్వ దవాఖానను తనిఖీ చేశారు. దవాఖానలోని అన్ని వార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మందులు లేక రోగుల అవస్థలు అని కొందరు అవాస్తవ వార్తలు వ్యాప్తి చేయడంతో స్పందించి దవాఖాన పరిశీలించినట్లు తెలిపారు. దవాఖానలో ఎలాంటి లోటుపాట్లు లేవని రోగులు చెబుతున్నారు. అనంతరం రెండో రోజు నర్సాపూర్ మున్సిపాలిటీ ప్రజాపాలన వార్డుసభలో కలెక్టర్ పాల్గొన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని కలెక్టర్ తెలిపారు. నాలుగు సంక్షేమ పథకాలు ఈ నెల 26న ప్రారంభించుకోవడం శుభపరిణామం అన్నారు. కలెక్టర్ వెంట దవాఖాన సూపరింటెండెంట్ పావని, వార్డు సభలో తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయీమొద్దీన్, పాల్గొన్నారు.

### రోడ్డు నిబంధనలు పాటించాలి

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 22: మనిషి ప్రాణం పోతే తిరిగి రాదని, రోడ్డు ప్రమాదాల కారణంగా నిత్యం ఎంతోమంది మృతి చెందుతున్నారని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా జిల్లా రవాణా, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జిల్లా రవాణాధికారి వెంకటస్వామి అధ్యక్షతన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ, రాందాస్ చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్, ఎస్పీ హాజరై ర్యాలీని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో వాహనాల సంఖ్య పెరుగుతన్నదని, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండటం లేదన్నారు.

### సురక్షిత ప్రయాణం చేయాలి: ఎస్పీ

సురక్షిత ప్రయాణంతో గమ్యస్థానాలను చేరుకోవచ్చని ఎస్పీ ఉదయ్‌కుమార్ అన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ ఏడాది రోడ్డు ప్రమాదాల్లో 327 మంది మృతి చెందారన్నారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఈఈ సర్దార్‌సింగ్, డీఎస్పీ ప్రసన్నకుమార్, ఎంవీఐలు విజయలక్ష్మి, శ్రీలేఖ, ఎంఈవో నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలనలో ప్రశ్నిస్తే కేసులా?


శివ్వంపేట పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

శివ్వంపేట, జనవరి 22: కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్యాయంపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. పిల్లుట్ల గ్రామంలో ప్రొటోకాల్ కోసం ప్రశ్నించిన బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ శివ్వంపేట పోలీస్‌స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఫొటోను ప్రొటోకాల్ ప్రకారం పెట్టాలని నిలదీయడం తప్పా అని ప్రశ్నించారు. పోలీసులు కాంగ్రెస్ నాయకుల ఒత్తిళ్లకు భయపడి కేసులు పెట్టడం ఏమిటని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల జోలికి వస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ జడ్పీటీసీ పబ్బ మహేశ్ గుప్తా, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు నాగేశ్వర్ రావు, సీనియర్ నాయకులు యాదగౌడ్, ముద్దగల లక్ష్మీనరసయ్య, నరసింహారెడ్డి, శ్రీనివాస్ గుప్తా, లాయక్, పద్మా వెంకటేశ్, చింత స్వామి, కన్నారం దుర్గేశ్, కుంట లక్ష్మణ్, రాకేశ్ రెడ్డి ఉన్నారు.

# ప్రభుత్వ దవాఖానను సందర్శించిన ఒడిశా బృందం


తూప్రాన్ ప్రభుత్వ దవాఖానను పరిశీలిస్తున్న ఒడిశా బృందం

తూప్రాన్, జనవరి 22: తూప్రాన్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో ఒడిశా రాష్ర్టానికి చెందిన బృందం బుధవారం సందర్శించారు. నగరానికి చెందిన అనిల్‌కుమార్, పురుషోత్తం ఆధ్వర్యంలో దవాఖానలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలను, ఎమర్జెన్సీ, ఓపీడీ, ప్రసవాలు తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. వారితో దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ అమర్‌సింగ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

# తాళం వేసిన ఇండ్లే టార్గెట్

**- రెండిండ్లలో 48 తులాల వెండి, రూ.13 వేల నగదు చోరీ**

నిజాంపేట, జనవరి 22: తాళం వేసిన ఇండ్లనే దుండగులు టార్గెట్ చేసుకుని చోరీకి పాల్పడుతున్న ఘటన నిజాంపేటలో మంగళవారం అర్ధ రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేటకు చెందిన శ్రీనివాస్‌రెడ్డి ఇంటికి తాళం వేసి పనుల నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాడు. బత్తుల రమేశ్ నివసిస్తున్న ఇంటికి తాళం వేసి దూరంలో ఉన్న తన కుటుంబసభ్యుల ఇంటికి వెళ్లాడు. అదనుగా భావించిన వారు ఇంటికి వేసిన తాళాలను పగులగొట్టి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన 40 తులాల వెండి, రూ.10 వేల నగదు, రమేశ్‌కు చెందిన 8 తులాల వెండి, రూ.3 వేల నగదును చోరీ చేశారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని విచారణ చేపట్టారు.

# గ్రామ సభల్లో ప్రొటోకాల్ రగడ




నర్సాపూర్, జనవరి 22: గ్రామసభ ఫ్లెక్సీల్లో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఫొటో లేదని బీఆర్ఎస్ మాజీ జడ్పీటీసీ బాబ్యానాయక్, మాజీ సర్పంచ్ సామ్యానాయక్ చేసిన ఆందోళనతో అధికారుల్లో చలనం వచ్చింది. గ్రామసభల్లో ఎక్కడా ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధుల ఫొటోలను ఫ్లెక్సీలో అధికారులు పెట్టలేదు. తుల్జారాంపేట్‌లో ఎమ్మెల్యే ఫొటో ఎందుకు పెట్టలేదని మాజీ జడ్పీటీసీ బాబ్యానాయక్, మాజీ సర్పంచ్ సామ్యానాయక్ అధికారులను నిలదీశారు. వారు చేసేది లేక బుధవారం గ్రామసభల్లో ఎమ్మెల్యే ఫొటోను చేర్చారు.

### శివ్వంపేటలో..

శివ్వంపేట, జనవరి 22: శివ్వంపేట మండలంలో గ్రామ సభల సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ప్రొటోకాల్ వివాదం నెలకొన్నది. బీఆర్ఎస్ నాయకులు ఆందోళనలు చేయడంతో అధికారులు స్పందించారు. పలు గ్రామసభల్లో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఫొటోను ఫ్లెక్సీలో చేర్చారు.

# క్షేత్రస్థాయిలో విద్యార్థుల పరిశీలన


హస్తాల్‌పూర్ వద్ద వ్యవసాయ పొలంలో నాటు వేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వెల్దుర్తి, జనవరి 22: క్షేత్రస్థాయిలో విషయాలను ప్రాక్టికల్‌గా తీసుకోవడంతో నైపుణ్యం పెరుగుతుందని వెల్దుర్తి జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సాంబయ్య అన్నారు. బుధవారం విద్యార్థులను హస్తాల్‌పూర్ వద్ద ఉన్న వ్యవసాయ క్షేత్రానికి తీసుకెళ్లారు. వ్యవసాయ పనులు, సాగు విధానం, నారు, నాటు వేయడం వంటి పనులపై అవగాహన కల్పించారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



మనోహరాబాద్, జనవరి 22: మనోహరాబాద్ గ్రామానికి చెందిన మహేందర్ అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందాడు. సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సహకారంతో రూ.18,500 చెక్కును బుధవారం అందజేశారు. జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు రేణుకుమార్, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

# సీజ్ చేసిన మాదకద్రవ్యాలు ధ్వంసం



నర్సాపూర్/మెదక్ అర్బన్, జనవరి 22: జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్లలో వివిధ మాదక ద్రవ్యాల కేసుల్లో పట్టుబడిన ఎండు గంజాయి, డైజోఫాం, అల్ప్రాజోలం, ఆలం లాంటి మాదకద్రవ్యాలను డిప్యూటీ కమిషనర్ మెదక్ డివిజన్, సంగారెడ్డి ఆదేశాల మేరకు ధ్వంసం చేసినట్లు నర్సాపూర్ ఎక్సైజ్ సీఐ పద్మ పేర్కొన్నారు. నర్సాపూర్ మండలంలోని కాగజ్‌మద్దూర్ గ్రామ సమీపంలో మరిడి బయో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో అసిస్టెంట్ కమిషనర్ ప్రొహిబిషన్, ఎక్సైజ్, మెదక్ డివిజన్, సంగారెడ్డి జి.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలు ధ్వంసం చేశారు. జిల్లా పరిధిలో మొత్తం 30 కేసుల్లోని 21.428 కిలోల గంజాయి, 19 గంజాయి మొక్కలు , అల్ప్రాజోలం 7.877 కిలోలు, డైజోఫాం 3.95 కిలోలు, గంజాయి విత్తనాలు 0.160 కిలోలు, ఆలం 24 కిలోలు లను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ధ్వంసం చేసిన మాదక ద్రవ్యాల విలువ మొత్తం రూ. 94,07,068 ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మెదక్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు, రామాయంపేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.రాణి, సబ్ ఇన్‌స్పెక్టర్లు రాజేశ్, మాన్‌సింగ్, రాఘవేందర్‌రావు, అరుణ పాల్గొన్నారు.